




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం, మే 12, 2026

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-




## బండి భగీరథ్ కేసులో వేగంగా దర్యాప్తు

- పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు డీసీపీ రితిరాజ్
- బాధితురాలి వాంగ్మూలంపై ప్రత్యేక దృష్టి
- నేడు భరోసా కేంద్రంలో మరోసారి విచారణ
- సెక్షన్ల మార్పు, అదనపు నేరాల నమోదుపై పరిశీలన
- కేసు పురోగతిని సమీక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి
- సీసీ ఫుటేజీలు, ఇతర ఆధారాల సేకరణలో పోలీసులు

హైదరాబాద్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దర్యాప్తును పోలీసులు మరింత వేగవంతం చేశారు. రాజకీయంగా చర్చనీయాంశమైన ఈ వ్యవహారంలో ప్రతి అంశాన్ని సమగ్రంగా పరిశీలిస్తూ ఆధారాల సేకరణపై దృష్టి సారించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కేసు పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టిన కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సోమవారం నేరుగా పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కేసు పురోగతిని సమీక్షించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు, ఇప్పటివరకు జరిగిన ప్రాథమిక దర్యాప్తు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 8న 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండి భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు అయిన

(మిగతా 2వ పేజీలో)

# విద్యకు 15% బడ్జెట్!

### సర్కారు బడుల బలోపేతమే లక్ష్యం

- ఇంటర్ డ్రాపవుట్స్‌పై సీఎం రేవంత్ ఆందోళన
- ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకూ సమగ్ర పాఠశాలలు
- విద్యార్థులకు అల్పాహారం, రాగిజావ, పాలు
- 11 వేల టీచర్ల నియామకాలపై ప్రస్తావన
- నైపుణ్యాలను వెలికితీసే ఉపాధ్యాయులకు సత్కారం



హైదరాబాద్, నారాయణగూడ: రాష్ట్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యం విద్యారంగానికేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భవిష్యత్తులో రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం వరకు నిధులను విద్యాశాఖకు కేటాయించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలను కేవలం చదువు చెప్పే కేంద్రాలుగానే కాకుండా పేద పిల్లల భవిష్యత్తును మలిచే జ్ఞాన మందిరాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆత్మవిశ్వాసాన్ని అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన విద్యా వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. క్యూర్ పరిధిలో రూ.1,761 కోట్లతో నిర్మించనున్న పాఠశాల భవనాలకు ఈ సందర్భంగా శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసేందుకు సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు. తమ చిన్నతనంలో ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందించకపోయి ఉంటే తాను ముఖ్యమంత్రి స్థాయికి చేరుకునేవాడిని కాదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సమాజంలో ఉన్న అనేక మంది ప్రముఖులు కూడా ప్రభుత్వ విద్య ద్వారానే ఎదిగారని గుర్తుచేశారు. ఇప్పటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు వివిధ కారణాలతో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు వెనుకంజ వేస్తున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులపై ఉందన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడాన్ని ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా, భావోద్వేగంగా స్వీకరించాలని సూచించారు. ఉపాధ్యాయులు పిల్లలతో మరింత ఆప్యాయంగా మెలగాలని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని పిలుపునిచ్చారు. గత రెండేళ్లుగా అమలు చేస్తున్న విద్యా సంస్కరణల ఫలితంగా

(మిగతా 2వ పేజీలో)

### తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా
## గద్వాల విజయలక్ష్మి నియామకం



- ఆరుగురు సభ్యులను కూడా నియమించిన ప్రభుత్వం
- సభ్యుల్లో కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత తదితరులు
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం




### త్వరలో 17 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'ఎస్ఐఆర్': ఎన్నికల సంఘం

- ఐదు రాష్ట్రాల ఎన్నికలు సహా వివిధ కారణాలతో తాత్కాలిక బ్రేక్
- 99 కోట్ల మంది ఓటర్లలో 60 కోట్ల ఓటర్ల 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తి
- మిగిలిన 40 కోట్ల ఓటర్ల 'ఎస్ఐఆర్' ప్రక్రియ త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడి




### చెరువుల చెంత హైడ్రా సీసీటీవీ నిఘా

- ఆక్రమణలకు ఆస్కారం లేకుండా చర్యలు
- 900ల కెమేరాలను అమర్చి నిరంతర పర్యవేక్షణ



## స్టాలిన్ నివాసానికి సీఎం విజయ్

- తమిళ రాజకీయాల్లో ఆసక్తికర భేటీ
- మర్యాదపూర్వక సమావేశంగా పేర్కొన్న టీవీకే వర్గాలు
- ఖజానా ఖాళీ వ్యాఖ్యల తర్వాత తొలి ముఖాముఖి
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై చర్చించిన నేతలు
- సమావేశంలో పాల్గొన్న ఉదయనిధి స్టాలిన్

చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన టీవీకే అధినేత విజయ్ సోమవారం మాజీ సీఎం, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ నివాసానికి వెళ్లి భేటీ అయ్యారు. మర్యాదపూర్వక సమావేశంగా ఇరుపక్షాలు పేర్కొన్నప్పటికీ, ఇటీవల రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై పరస్పర విమర్శలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. చెన్నైలోని స్టాలిన్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చ

(మిగతా 2వ పేజీలో)

## గుప్త నిధుల కోసమే అర్ధరాత్రి కాకతీయుల నాటి శివాలయం కూల్చివేత

- బడి పేరుతో గుడిని కూల్చిన రేవంత్ రెడ్డి.. లంక బిందెల వేటలో 24 అడుగుల తవ్వకాలు.
- ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో 500 కోట్ల భారీ కుంభకోణం.. అన్నీ ఎక్సెస్ టెండర్లే.
- అశోక్ నగర్లో ధ్వంసమైన మట్టికోట శివాలయాన్ని పరిశీలించిన మాజీ మంత్రి హరీశ్



వరంగల్ : వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ధ్వంసం చేసిన 800 ఏళ్ల చరిత్ర గల కాకతీయుల నాటి మట్టికోట శివాలయాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు గారు సందర్శించారు. కూల్చివేతకు గురైన ఆలయ ప్రాంగణంలో స్థానికులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటనలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్ నాయక్, వినయ్ భాస్కర్,

(మిగతా 2వ పేజీలో)



## మహబూబ్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురి మృతి

- మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డుపై ఘటన
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఇద్దరు బైకర్లు

మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లాలో గత రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డులోని పాలకొండ జంక్షన్ వద్ద ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, ఆదివారం రాత్రి పాలకొండ కూడలి వద్ద యూ-టర్న్ తీసుకుంటున్న ఒక కారును అతివేగంగా వస్తున్న స్పోర్ట్స్ బైక్ బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బైక్‌పై ఉన్న ఇద్దరు, కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులోని మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. బైక్ అతివేగమే ప్రమాదానికి ప్రాథమిక కారణమని భావిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లు, ఘటనా స్థలంలో లభించిన ఆధారాల సహాయంతో మృతుల పూర్తి వివరాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

# సంస్థాన్ లో ఘనంగా ఎస్ఎస్సి 2000-2001 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుకలు

### రజతోత్సవ వేడుకల్లో ఆనందోత్సవాల మధ్య పాల్గొన్న పూర్వ విద్యార్థులు

### కార్యక్రమంలో పాల్గొన్న ఆనాటి ఉపాధ్యాయులు, సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి




వార్త మిర్రర్, మల్కాజిగిరి : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో పదవ తరగతి 2000–2001 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుండి పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమం ఆనాటి జ్ఞాపకాలతో మొదలై నేటి జ్ఞాపకాలతో ముగిసింది. విద్యార్థులు తాము పదవ తరగతిలో ఎలా ఉండేవారము అని ఉపాధ్యాయుల ముందు గుర్తు చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మిత్రులందరు కలిసేందుకు కృషి చేసిన రజితోత్సవ వేడుకల ఆర్గనైజింగ్ కమిటీని స్నేహితులు అందరు అభినందించారు. అనంతరం అందరూ డాన్సులు చేసి వారి ఆనందాన్ని అందరితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, ఎస్ఎస్సి 2000–2001 బ్యాచ్ పూర్వ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.














## త్వరలో 17 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'ఎస్ఐఆర్': ఎన్నికల సంఘం

### ఐదు రాష్ట్రాల ఎన్నికలు సహా వివిధ కారణాలతో తాత్కాలిక బ్రేక్

### 99 కోట్ల మంది ఓటర్లలో 60 కోట్ల ఓటర్ల 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తి

### మిగిలిన 40 కోట్ల ఓటర్ల 'ఎస్ఐఆర్' ప్రక్రియ త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడి

రాబోయే కొద్దిరోజుల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) మూడవ దశను ప్రారంభిస్తామని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. 40 కోట్ల మంది ఓటర్లను కవర్ చేస్తూ, మిగిలిన 17 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'ఎస్ఐఆర్' ఉంటుందని వెల్లడించారు. ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో 'ఎస్ఐఆర్' ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఫలితాలు వెలువడిన నేపథ్యంలో మూడో దశకు సమాయత్తమవుతుంది. ఇప్పటి వరకు ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబర్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా, బీహార్ రాష్ట్రాలలో 'ఎస్ఐఆర్' చేపట్టారు. అసోంలోనూ ప్రత్యేక సవరణ కార్యక్రమం జరిగింది. మొత్తం దేశంలోని 99 కోట్ల మంది ఓటర్లలో 60 కోట్ల ఓటర్లకు సంబంధించిన 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వాస్తవానికి, ఏప్రిల్ నుంచి సర్ ప్రక్రియ చేపట్టనున్నట్లు పై రాష్ట్రాలకు ఫిబ్రవరి 19వ తేదీన ఈసీ లేఖ రాసింది. ఐదు రాష్ట్రాల ఎన్నికలు సహా వివిధ కారణాల వల్ల బ్రేక్ పడింది. వాటితో పాటు ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు సుప్రీంకోర్టుకు వెళ్ళడం కూడా జాప్యానికి కారణమైంది.

## జూన్ 1 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం: పశ్చిమ బెంగాల్ సీఎం



ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తామని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి అన్నారు. జూన్ 1వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ప్రజారవాణాపై ఆధారపడే లక్షలాది మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఇందులో ఉద్యోగినులు, విద్యార్థులు కూడా ఉంటారని తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కూడా వచ్చే నెల నుంచి అమలు చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్ళు పొడిగించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.




## చెరువుల చెంత హైడ్రా సీసీటీవీ నిఘా

### ఆక్రమణలకు ఆస్కారం లేకుండా చర్యలు

### 900ల కెమేరాలను అమర్చి నిరంతర పర్యవేక్షణ

హైదరాబాద్, మే 11: చెరువుల పరిరక్షణకు హైడ్రా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. మట్టితో నింపి కబ్జా చేయాలనే ప్రయత్నాలకు చెక్ పెట్టింది. చెరువుల చెంత సీసీటీవీ కెమేరాలు పెట్టి గట్టి నిఘా ఏర్పాటు చేసింది. వీటిని హైడ్రా కార్యాలయంలోని సర్వర్‌కు అనుసంధానించింది. నిరంతరం చెరువుల చెంత ఏం జరుగుతుందో తెలుసుకునే వ్యవస్థను హైడ్రా కార్యాలయం నుంచే పర్యవేక్షించేలా ఏర్పాటు చేసింది. సీసీటీవీ కెమేరా నిఘా వ్యవస్థను సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రారంభించారు. చెరువులలో మట్టి పోయకుండా.. ఆక్రమణలు జరగకుండా ఇప్పటికే లేక్ ప్రొటెక్షన్ టీమ్‌లు పర్యవేక్షిస్తున్నాయి. వీటికి తోడు సీసీటీవీ కెమేరా వ్యవస్థ అదనంగా అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. చెరువుల్లో ఎవరైనా నిర్మాణ వ్యర్థాలు వేసినా.. మట్టితో నింపేందుకు ప్రయత్నించినా..కబ్జాలు చేసినా సీసీటీవీ కెమేరాల ద్వారా తెలుసుకునే వెసులుబాటు హైడ్రాకు లభించింది. హైడ్రా కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూం నుంచి మోనిటర్లద్వారా నిరంతరం పరిశీలిస్తారు. మట్టిని తెచ్చి పోసిన పక్షంలో ఆ వాహనం వివరాలను తెలుసుకోవడంతో పాటు.. అక్కడే ఉన్న లేక్ ప్రొటెక్షన్ టీమ్‌ను కూడా అప్రమత్తం చేస్తారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న మోనిటర్లకు కూడా చెరువుల చెంత హైడ్రా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమేరాలను అనుసంధానం చేశారు. దీంతో నిఘా మరింత పటిష్టంగా ఉంటుందని హైడ్రా కమిషనర్ చెప్పారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో పాటు అదనపు కమిషనర్ ఆర్ సుదర్శన్ కూడా సీసీటీవీ వ్యవస్థను ప్రారంభించిన వారిలో ఉన్నారు.




## సృజనాత్మకతను వెలికి తీయాలి

### ::: తహసిల్దార్ సతీష్ కుమార్ శర్మ

వార్త మిర్రర్ మందమర్రి మే 11: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని మండల తహసిల్దార్ సతీష్ కుమార్ శర్మ, ఎంపీడీవో ఎన్ రాజేశ్వర్ లు అన్నారు. పట్టణంలోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ పాఠశాలలో ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంపును సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యాంశాల భోదనే కాకుండా వారిలోని సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే లక్ష్యంతో ఆర్ట్, క్రాఫ్ట్, డాన్స్, యోగా, స్టిచింగ్, ఇండోర్ గేమ్స్ వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 11 నుండి మే 25 వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహించనున్న సమ్మర్ క్యాంప్ ను మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించు కోవాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో ఎన్ రాజేశ్వర్, మండల విద్యాధికారి రాథోడ్ రమేష్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉరివేసుకొని వృద్ధురాలు మృతి



వార్త మిర్రర్, మందమర్రి మే 11: ఉరేసుకొని వృద్ధురాలు గసికంటి కాంతమ్మ (85) ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని మూడో జోన్ లో సోమవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతు జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఈ మేరకు మృతురాలి కుమారుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.




## తెలంగాణ మోడల్ స్కూల్ లో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 11

మోడల్ స్కూల్ (పీఎంశ్రీ టీజీమ్స్) తెలంగాణ ఇటిక్యాల లో ప్రతిష్టాత్మక సమ్మర్ క్యాంప్ ఘనంగా ప్రారంభించబడింది. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయికల్ ఎం.ఈ.ఓ శ్రీ రాఘవులు హాజరయ్యారు. కార్యక్రమం లో ప్రిన్సిపల్ నర్సయ్య తో పాటు ఎన్ శ్రీనివాస్ (సర్పంచ్), కాటిపెల్లి గంగారెడ్డి, ఆత్మ చైర్మన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమ్మర్ క్యాంప్ 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు విద్యార్థుల కోసం మే 11వ తేది నుండి 25 2026వరకు నిర్వహించబడుతోంది. విద్యార్థుల్లో సృజనాత్మకత, శారీరక దృఢత్వం మేధో వికాసాన్ని పెంపొందించేందుకు డ్రాయింగ్, చెస్, స్టోరీ టెల్లింగ్, యోగా, ధ్యానం, కుట్లు అల్లికలు, క్విజ్,కంప్యూటర్, మరియు భాషా ఉత్సవాల శిక్షణ అందించబడుతోంది. తెలంగాణ ప్రభుత్వం "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. మే 11 నుండి మే 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా విద్యా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన అతిథులు ప్రభుత్వము కల్పించిన ఈ మంచి అవకాశాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సమగ్ర అభివృద్ధిని సాధించాలని కోరారు.




## జాతీయ స్థాయికి ఎంపికైన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 11

రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో మెడల్స్ సాధించి త్వరలో మధ్యప్రదేశ్ లో జరిగే జాతీయ స్థాయికి ఎంపికైన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ రాయికల్ విద్యార్థులుతేదీ,:- మే 9,10 రంగారెడ్డి జిల్లా లో రాష్ట్రస్థాయిలో జరిగిన కిక్ బాక్సింగ్ పోటీలలో 10,11,12 వయస్సు పాయింట్ ఫైట్ విభాగంలో బి రుత్విక్ గోల్డ్ మెడల్, ఎం హర్షవర్ధన్ బ్రాంజ్ మెడల్ సాధించారు. 13,14,15 వయస్సు పాయింట్ ఫైట్ విభాగంలో ఆర్ అక్షయ్ గోల్డ్ మెడల్, జి మనోజ్ , పి కృష్ణ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ విద్యార్థులు జూన్ 17 రోజున మధ్యప్రదేశ్ ఒడిస్సాలో జరిగే నేషనల్ లెవెల్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ జె తిరుపతిరావు, ప్రిన్సిపల్ జే వేణుగోపాలరావు, కోచ్ సంతోష్ లు అభినందించారు.



## నిబంధనల ఉల్లంఘన పై చట్టపరమైన చర్యలు తీసుకోండి...
## పీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్...

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రధాన కూడలిలో, కాలనీలోని రోడ్డు, ఇల్లు గోడలు ఇలా ప్రభుత్వం, ప్రైవేట్ అనే తేడా లేకుండా విపరీతమైన రీతిలో ఇష్ట రీతిగా వెలిసిన ఫ్లెక్సీ, వాల్ పోస్టర్, వాల్ రైటింగ్ వంటి చట్ట నిబంధనలను ఉల్లంఘించిన అంశాలు పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫ్లైఓవర్ లు, కాలనీ, పార్క్, కూడలిలా సుందరీకరణ పనులు చుట్టశుద్ధిగా కోట్ల రూపాయలు వెచ్చించి పనులు చేపట్టిందని అన్నారు. ఒక పక్క నిర్మిస్తుంటే మరో పక్క నుంచి పాడుచేస్తూ రావడం శోచనీయం అని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి నిర్మూలన చర్యలు చేపట్టాలని కోరారు. జి.ఓ కాపీని జతచేస్తూ అవసరమైన చోట జరిమానాలు విధించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు కూడా ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను కాపాడడంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అజామ్, నాగరాజు, ఎన్ ఎస్ యు ఐ,మౌళి పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 82 ఫిర్యాదులు......



సైబరాబాద్ వార్త మిర్రర్ : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 82 ఫిర్యాదులు అందాయి. కమిషనర్ సృజన అన్ని విభాగాల అధికారులతో కలిసి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన 55, ఇంజనీరింగ్ 14, పారిశుధ్యం 6, భూసేకరణ 2, అర్బన్ బయోడైవర్సిటీ 2, యాడ్వర్టైజ్‌మెంట్ 1, రెవెన్యూ 1, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ 1 ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక ట్రాకింగ్ ఐడి కేటాయించినట్లు అధికారులు తెలిపారు. అందిన ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో తీసుకుని వివిధ శాఖల సమన్వయంతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర ఫాలోఅప్ నిర్వహిస్తూ సమస్యల పరిష్కారంపై పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

# 10 ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ఐటి పాముల మల్లికార్జున ను అభినందించిన- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

### ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా.!

### ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

ఎల్ బి నగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఐటిపాముల విజయకుమార్ ఈ సందర్భంగా తన కుమారుడు ఐటిపాముల మల్లికార్జున పరిచయం చేస్తూ హయత్ నగర్ జెడ్ పి హెచ్ ఎస్ హైస్కూల్లో 10 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని పరిచయం చేయగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఐటపాముల మల్లికార్జున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, విద్యార్థులు తల్లిదండ్రులకు విద్యా భారం కాకూడదని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరి నాణ్యమైన విద్యను అందుకోవాలని విద్యార్థులు ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు

# ఓఆర్ఆర్‌పై 400 కిలోల గంజాయి పట్టివేత....



గచ్చిబౌలి వార్త మిర్రర్ : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ హద్దులో ఓఆర్ఆర్ ముత్తంగి సమీపంలో సోట్ కూకట్‌పల్లి బృందం, పటాన్‌చెరు పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకుని 400 కిలోల డ్రై గంజాయి, ఒక డీసీఎం వాహనం, ఒక ఎర్టిగా కారు, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ సుమారు రూ.2 కోట్లుగా పోలీసులు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన మహిళ రిసీవర్‌గా, ఒడిశాకు చెందిన వ్యక్తి సరఫరాదారుగా వ్యవహరిస్తుండగా, మధ్యవర్తులు మరియు డ్రైవర్ల సహకారంతో ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఖాళీ కూరగాయల ప్లాస్టిక్ ట్రేల కింద గంజాయిని దాచిపెట్టి డీసీఎంలో తరలిస్తుండగా, ఎస్కార్ట్ వాహనంగా ఎర్టిగా కారును ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఏడుగురిని అదుపులోకి తీసుకుని, ఇద్దరు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# వీరవెల్లి గ్రామ ఐకెపి కేంద్రాన్ని పరిశీలించిన - మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి- బిఆర్ఎస్ నాయకులు

### తేమ పేరుతో ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణం

### ప్రభుత్వం వెంటనే దాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసిన నాయకులు



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

భువనగిరి మండలం వీరవెల్లి గ్రామంలో ఐకెపి కేంద్రాన్ని భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి, బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి ,స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పి ఏ ఆర్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ, రైతులను తేమ పేరుతో,



మాచర్ రావడం లేదని 16వ రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడం దారుణమని ప్రభుత్వ వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో భువనగిరి మండల పార్టీ అధ్యక్షుడు మరియు తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బాల్గురి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేశపట్నం రమేష్, భువనగిరి మండల సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు జక్కా రాఘవేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ తోటకూరి శంకరయ్య, మాజీ ఎంపీటీసీ కంచు మల్లయ్య,చింతల శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా నాయకులు ర్యాకల శ్రీనివాస్, పుట్ట వీరేష్, సింగిల్ విండో డైరెక్టర్ చింతల వెంకటరెడ్డి, రేగు శ్రీశైలం, బండసోమవారం సర్పంచ్ కటిక జంగయ్య, రాసాల శేఖర్ యాదవ్, బాత్కా అశోక్, కదారి బాలు యాదవ్, గ్రామ రైతులు పాల్గొన్నారు

# అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 11

నిస్వార్థమైన ప్రేమనందించే అమ్మలందరికీ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ రాయికల్ పట్టణంలోని స్థానిక సర్దార్ పటేల్ విగ్రహం దగ్గర ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మొగిలిపాక మహేశ్ మాట్లాడుతూ.. అమ్మలందరి మొహంలో చిరునవ్వులు చూడటమే మా ఫౌండేషన్ లక్ష్యమనీ, అమ్మ పేరులో ప్రేమని.. పిలుపులో మాధుర్యాన్ని నింపుకున్న అమృత మూర్తి అమ్మా..అందుకే మా ఫౌండేషన్ పేరు "అమ్మ" గా నామకరణం చేశామన్నారు. ఈ లోకాన్ని సృష్టించిన ఆ దేవాది దేవుడు కూడా మానవ రూపం ధరించి అమ్మ కడుపునే పుట్టాడనీ, అమ్మను ఎంత పొగిడినా తక్కువే. త్యాగమూ, ప్రేమా కలిస్తే అందులో నుంచి అమ్మే పుట్టుకొస్తుందనీ, అమ్మకు ప్రత్యామ్నాయం లేదు, అమ్మ ఉన్న చోట అదృష్టం పురి విప్పి ఆడుతుందన్నారు. అనంతరం ఫౌండేషన్ ద్వారా చేసిన సేవలను వివరించారు రాబోయే కాలంలో ఇంకా పలు రకాల సేవలను ఆరంభించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాకేష్ నాయక్, శ్రీనివాస్, గోపి,ప్రవీణ్, చంద్రం, కిరణ్, గణేష్ తదితరులున్నారు.

# రాయికల్‌లో ప్రారంభమైన జనాభా, ఇండ్ల గణన

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 11

జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో సోమవారం జనాభా, ఇండ్ల గణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం మే 11 నుంచి జూన్ 9 వరకు కొనసాగనుంది. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు ఈ గణన కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా, క్రమబద్ధంగా నిర్వహించనున్నారు.స్వాతంత్ర్యం అనంతరం నిర్వహిస్తున్న ఎనిమిదవ జనాభా గణనగా ఇది ప్రత్యేకత సంతరించుకుంది. గ్రామం, పట్టణం, వార్డు స్థాయి వరకు ప్రజల ప్రాథమిక సమాచారానికి జనాభా గణన ప్రధాన ఆధారంగా నిలుస్తుంది. గృహాల నివాసయోగ్య స్థితి, వసతులు, ఆస్తులు, జనాభా, మతం, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, భాష, అక్షరాస్యత, విద్య, ఆర్థిక కార్యకలాపాలు, వలసలు, సంతాన వివరాలు తదితర అంశాలపై సూక్ష్మస్థాయి సమాచారాన్ని సేకరిస్తారు. భారతదేశంలో డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న తొలి జనాభా గణన కావడంతో దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఎన్యుమరేటర్లు తమ స్మార్ట్ ఫోన్లలో ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ల ద్వారా కుటుంబాల వివరాలను నమోదు చేస్తున్నారు. అదనంగా ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను కూడా అందుబాటులో ఉంచారు. మొదటి దశలో ఇండ్ల జాబితా, గృహాల నివాసయోగ్య స్థితి, కుటుంబ వసతులు, ఆస్తులపై వివరాలు సేకరించనున్నారు. ఈ



కార్యక్రమంలో సూపర్వైజర్లు పొన్నం రమేష్, దాసరి లక్ష్మి, ఎన్యుమరేటర్లు లక్కడి రాజారెడ్డి, సంగర్తి శోభ, గంగా జమున, దొంతి సతీష్, మండలోజు రవీందర్, అభయ్ రాజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ప్రతి గింజను కొనాలని ...

## మార్కెట్ యార్డు వద్ద రైతుల ధర్నా







వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 11

అకాల వర్షాలతో తడిసిన ప్రతి వరి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, తూకం వేసిన ధాన్యానికి వెంటనే మిల్లులకు తరలించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ముందు వందలాది మంది రైతులతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ?ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా, ధాన్యం తరలింపులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం కురిసిన అకాల వర్షానికి మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన వందలాది క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనకుండా అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ?వేగవంతమైన తరలింపు,అధికారులు, మిల్లర్లు సమన్వయంతో ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి. వసతుల కల్పన అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, అవసరమైన చోట అమాలీల సంఖ్యను పెంచాలి.సకాలంలో చెల్లింపులు ధాన్యం అమ్మిన రైతులకు నగదు చెల్లింపుల్లో జాప్యం చేయకూడదు.మోసాలు అరికట్టాలి తూకం, తాలు పేరుతో రైతులను మోసం చేసే చర్యలను అడ్డుకోవాలి.?పది రోజుల్లోగా మార్కెట్ యార్డులోని ధాన్యాన్ని తరలించకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చీర్క అలివేలు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గోశిక కరుణాకర్, బండారు నరసింహ, ఆకుల ధర్మయ్య, పర్ని ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆందోళన చేస్తున్న రైతులతో మార్కెట్ చైర్మన్ వెంకటయ్య,చౌటుప్పల్ మండల తహసిల్దార్ వీరాబాయి మాట్లాడుతూ ధాన్యము కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

# ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేస్తాము..

## మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 11

చౌటుప్పల్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో నిల్వ ఉన్న ధాన్యం రాశులను మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చివరి గింజ వరకు ధాన్యం తూకాలు వేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం కావడానికి అవసరమైన అంశాలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన తూకాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని అన్నారు. ప్రతిపక్షాలు చేసే అనాలోచిత వ్యాఖ్యలను పట్టించుకోవద్దని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు..

# తెలంగాణ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం



దేవరకొండ మే 11 వార్త మిర్రర్ :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము నూతనంగా వడ్డెర కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి, చైర్మన్ గా వడ్డెర సామాజికవర్గానికి చెందిన ఆడబిడ్డ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు అయినా శ్రీమతి గుంజా రేణుక నారాయణ ను చైర్మన్ గా నియమించిన సందర్భంగా ..ఈరోజు వారి నివాసము లో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికారప్రతినిధి వరికుప్పల సుధాకర్ మరియు నల్గొండ జిల్లా మీడియా ఉ కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్ నర్రా బాలు గారు వెళ్లి మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలి యచేయడం జరిగింది.ఈ సందర్భంగా డి .సి. సి అధికారప్రతినిధి సుధాకర్ మాట్లాడుతూ ..రాష్ట్ర ప్రభుత్వము వడ్డెర జాతి ని వడ్డెర్ల కష్టాన్ని గుర్తించి వడ్డెర జాతి కోరిక ఉ కళ అయినా వడ్డెర కార్పొరేషన్ ను కాంగ్రెస్ పార్టీ సర్వత్రిక ఎన్నికల ముందు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన మాట ప్రకారము మాట నిలబెట్టుకుని వడ్డెర కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి మా వడ్డెర జాతి మహిళా బిడ్డ అయినా శ్రీమతి గుంజా రేణుక నారాయణ ను తెలంగాణ తొలి వడ్డెర కార్పొరేషన్ మహిళా చైర్మన్ గా చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ,ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల.రేవంత్ రెడ్డి బి.సి సంక్షేమ శాఖా మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ మిగతా మంత్రివర్గానికి పార్టీ అధ్యక్షుడు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ కు పార్టీ అధినాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుతు తనకు వరించినా ఈ పదవితో అత్యంత వెనుకబడిన మన వడ్డెర కుల అభ్యున్నతికి పాటుపడాలని ముఖ్యంగా వడ్డెర్ల ప్రధాన డిమాండ్ అయినా వడ్డెర్లను ఎస్ .టి .జాబితాలో చేర్పించే ప్రధాన డిమాండ్ ను ప్రభుత్వము దృష్టికి తీసుకుపోవాలని, వడ్డెర జాతి కి చెందిన ప్రత్యేక నిధులు కేటాయించి వడ్డెర్లకే చెందే విధముగా చూడాలని, వడ్డెర్లకు గుట్టలలో క్వారీలలో క్రషర్ లలో పూర్తి హక్కులు మన వడ్డెర కులస్తులకు మాత్రమే చెందేలా చూడాలని ,వడ్డెర్లు పనిచేస్తూ ప్రమాదవ శాత్తు మరణించినచో వారికీ మన ప్రభుత్వము తరుపున వెంటనే ఆ కుటుంబానికి తగిన పారితోదకము ఇప్పించి ఆ కుటుంబములో చదువుకునే వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగము వచ్చేలా ప్రయాతిన్చాలని , మన పేద వడ్డెర పిల్లలకు గురుకుల పాఠశాలలో ప్రత్యేక సీట్లను కేటాయించేవిధంగా ప్రభుత్వము దృష్టికి తీసుకెల్లాలని కోరడమైనది . అలాగే మా లాంటి యువనాయకులకు బాసటగా అండగా ఉండాలని కోరుకుంటూ ..భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులను పొందాలని మేము ఆకాంక్షించడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీమతి గుంజ రేణుక గారు తన సంతోషాన్ని వ్యర్థపరుస్తూ సానుకూలంగా మాట్లాడుతూ ..మన రాష్ట్రములో ఉన్నటువంటి అత్యంత వెనుకబడిన కులానికి చెందిన మన వడ్డెర కుల అభ్యున్నతికి తాను తప్పకుండ తోడ్పాటు అందిస్తానని వడ్డెర్ల అభివృద్ధికి కృషిచేస్తానని అదేవిధంగా నా వడ్డెర జాతికి నా సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని , ఎవ్వరికి ఏ ఆపద కష్టము సమస్య వచ్చిన నేను తప్పకుండా వస్తానని మీ కష్ట సుఖాలలో పాలుపంచుకుంటాని , వడ్డెరుల కష్టాలు డిమాండ్లను తప్పకుండా ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నమూ తప్పకుండా చేస్తాను అన్నారు. వడ్డెర కులస్థులకు అందరికి తన సపోర్ట్ ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె తెలియచేసారు. అదేవిధంగా తనను తాను చేసిన సేవలను గుర్తించి తనకి ఈ పదవి ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,పొన్నం ప్రభాకర్ మిగతా మంత్రి వర్గ సభ్యులకు ఉ టీపీసీసీ అధ్యక్షుడు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ కు ధన్యవాదాలు తెలుపుతూ,, తనకు ఇంతటి విశేష ఆదరణతో అభినందనలు శుభాకాంక్షలు తెలియచేస్తున్నటువంటి నా వడ్డెర కుల బంధువులకు అందరికి పేరు పేరున శ్రీమతి గుంజ రేణుక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపడము జరిగింది.

# మండలానికే ఆదర్శం పొన్నారం జడ్పీఎస్ఎస్

## సర్పంచ్ పెంచాల మధు



వార్త మిర్రర్, మందమర్రి మే 11:

మండలంలోని పొన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలను ఆదర్శ పాఠశాలగా తీర్చి దిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ పెంచాల మధు స్పష్టం చేశారు. 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం సమగ్ర శిక్ష నుండి విడుదలైన నిధుల నుండి మంజూరు అయిన ప్రత్యేక అవసరాలు గల పిల్లల కొరకు నిర్మించిన మరుగుదొడ్డి ని ఆయన ప్రారంబించి మాట్లాడారు. రానున్న నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలలో మరిన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థు లకు మెరుగైన విద్యా బోధన జరిగేలా కృషి చేస్తానన్నారు. మండలం లోనే పదవ తరగతి ఫలితాల్లో పొన్నారం పాఠశాల అగ్రగామిగా నిలుస్తుందని వచ్చే విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంచాల అమృత, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గోగు సుమలత, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసం, రాజన్న, లచ్చన్న, శ్రీనివాస్ యశోద లక్ష్మి సీఆర్పి రామచందర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య లు పాల్గొన్నారు.

# ఆపద లో రక్త దానం చేసిన యువకుడు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 11

జగిత్యాల పెగడపల్లి మండలం దొమలకుంట గ్రామానికి చెందిన పుప్పాల లక్ష్మి అనే మహిళ కు జగిత్యాల లో ఒక ప్రైవేట్ ఆసుపత్రి లో ఆపరేషన్ నిమిత్తం బి౦ రక్తం అవసరం అని డాక్టర్ తెలుపగా వారి కుటుంబ సభ్యులు కిష్టంపేట గ్రామ 9 వ వార్డు సభ్యుడు మ్యాకల రాజు కి సమాచారం అందించిన వెంటేనే స్పందించి తనది కూడా అదే గ్రూప్ కావడం తో బ్లడ్ బ్యాంక్ కి వెళ్ళి రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మ్యాకల రాజు ని పెషెంట్ వారి బంధువులు అభినందించారు. మ్యాకల రాజు మాట్లాడుతూ యువత ఆపద సమయం లో స్పందించి రక్త దానం చేసి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు.



## శ్రీ కోదండ రామాలయానికి శ్రీరాముని వెండి పాదుకలు అందజేత

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి మే 11

శ్రీ కోదండ సీతారామాలయం అయోధ్య - ఉప్పుమడుగు దేవస్థానానికి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు సాగి రాజేశ్వరరావు-ఆండాలమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శ్రీరాముని వెండి పాదుకలు సోమవారం రోజు అందజేయడం జరిగింది. ఇట్టి పాదుకలను హనుమాన్ దేవాలయం నుండి మంగళ హారతులతో ఎదుర్కొని దేవస్థానముకు అందజేసినారు. ఇట్టి కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు జీవన్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆదిత్య, కోశాధికారి సురేష్, ప్రధాన కార్యదర్శి రవీందర్, సహా కార్యదర్శి గంగమల్లు, అయోధ్య-ఉప్పు మడుగు గ్రామ సర్పంచులు సిరిపురం లక్ష్మి, కొత్తకొండ రోజా, ఉపసర్పంచులు తాలూక రాజేశం, అల్లపు గంగాధర్, డాక్టర్ దన్నపనేని విజయ్ చరణ్ రావు , మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినారు.





## ఆర్చి నిర్మాణ పనులకు శంకుస్థాపన...

## మున్సిపల్ చైర్ పర్సన్ మెదుగాల పావని రమేష్ గౌడ్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మే 11

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 9వ వార్డులో శ్రీ పెరమాండ్ల ఆంజనేయస్వామి దేవాలయం కు వెళ్లే దారిలో జడ్.పి. హెచ్.ఎస్ హైస్కూల్ పక్కన ఆర్చి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ మెదుగాల పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల అశోక్ రెడ్డి సంధ్యారాణి దంపతులు ఆర్చి నిర్మాణం పనులు చేయడం చాలా సంతోషం అని అన్నారు.ఈ కార్యక్రమం లో దేవాలయ కమిటీ అధ్యక్షులు ముత్యాల భూపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు అనెమోని చంద్రయ్య, కలకుంట్ల శివకుమార్, పోలోజు రామాచారి, ప్రధాన కార్యదర్శి మెన్నాం బాలరాజు, కోశాధికారి సామిడి రాఘవరెడ్డి, మాజీ కౌన్సిలర్ పోలోజు శ్రీధర్ బాబు, ప్రతినిధులు ముత్యాల పాపిరెడ్డి, బుడిగే బాలకృష్ణ గౌడ్, ఎడ్ల మహేందర్ రెడ్డి,గజ్జల లక్ష్మణ్ రాజు, సుంకి రవికుమార్, నల్ల జంగయ్య, చింతల పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కుమారుడు కేసు నమోదు పై నిర్లక్ష్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

## అందుగుల సైదులు ఎమ్మార్పీఎస్ చందంపేట మండల అధ్యక్షులు



చందంపేట మే 11 వార్త మిర్రర్:::::::

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పైన కేసు నమోదు అయ్యి మూడు రోజులైనా అరెస్టు చేయకుండా రాష్ట్ర హోం శాఖ మంత్రి, బండి సంజయ్ సీఎం రేవంత్ రెడ్డి పోలీస్ వ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకుని కేసును నీరుగార్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు అని ఎమ్మార్పీఎస్ చందంపేట మండల అధ్యక్షులు అందుగుల సైదులు గారు మాట్లాడుతూ దీబీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు బండి సంజయ్ దీబీ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేసి తన కుమారుడు బండి భగీరథుడు పై కేసు నమోదైన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ తెలంగాణలో రేపిస్టులను కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తా ఉన్నట్లు సమాచారం తెలంగాణలో మత రాజకీయాలు చేయడం బిజెపి కి అలవాటు అని ఆయన అన్నారు.